ఉచిత ఉపకరణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

పార్వతీపురం, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన విభిన్న ప్రతిభవంతులు ఉచిత ఉపకరణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని దివ్యాంగులు, హిజ్రాలు, వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె.కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయం లేదా, దగ్గరలోని ఇంటర్నెట్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం డౌన్‌లోడ్ కాపీతో పాటు సదరం, కుల, ఆదాయం ధ్రువపత్రాలు, రేషన్, ఆధార్ కార్డులు, పూర్తి ఫొటోలను సహాయ సంచాలకుల వారి కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

పాలన.. గాడిలో పడేదెప్పుడో?

- 'మన్యం'లో అన్ని శాఖలకూ ఇన్‌చార్జిలే దిక్కు..
- ఏళ్లు గడుస్తున్నా.. కానరాని పూర్తిస్థాయి అధికారుల నియామకం
- గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితం
- హడావుడిగా జిల్లా ఏర్పాటు
- శాఖలకు భవనాలు, మౌలిక వసతులపై దృష్టి సారించని వైనం
- పోస్టుల భర్తీకి చర్యలు శూన్యం
- ప్రస్తుతం తహసీల్దార్లు, ఇతర శాఖల ఉద్యోగులకు బదిలీలు
- తలెత్తుతున్న పాలనాపరమైన ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వం స్పందించాలని ప్రజల విన్నపం


పార్వతీపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాను అధికారుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దాదాపు అన్ని శాఖల్లోనూ ఇన్‌చార్జిల పాలనే కొనసాగుతోంది. జిల్లా ఏర్పడి మూడేళ్లవుతున్నా.. పరిస్థితి ఏ మాత్రం మారలేదు. రెవెన్యూ, వైద్యం వంటి కీలక శాఖల్లోనూ పూర్తిస్థాయి అధికారులు లేరు. ఉన్న సిబ్బంది బదిలీలపై వేరే ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఆ స్థానంలో కొత్తవారిని నియమించడం లేదు. దీంతో పాలనపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రజలకు కూడా పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం ఎంతో హడావుడిగా మన్యం జిల్లాను ఏర్పాటు చేసినప్పటికీ.. భవనాలు, మౌలిక వసతులపై దృష్టి సారించలేదు. కీలక శాఖల్లో పోస్టుల భర్తీ చేపట్టలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మన్యం జిల్లాపై దృష్టి సారించాల్సి ఉంది. అధికారుల నియామకాన్ని చేపట్టి.. పాలనను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని 'మన్యం' వాసులు అభిప్రాయపడుతున్నారు.

తహసీల్దార్లు ఇలా..

జిల్లాలో 15 మండలాలకు 15 మంది తహసీల్దార్లు ఉండాలి. ఒక్కో సబ్ కలెక్టర్ కార్యాలయానికి అడ్మినిస్ట్రేటివ్ హోదాలో ఇద్దరేసి చొప్పున నలుగురు ఉండాలి. కేఆర్‌సీ (కోనేరు రంగారావు కమిటీ)కి ప్రత్యేకంగా ఒకరు, కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లుగా నలుగురు చొప్పున మొత్తంగా 24 మంది తహసీల్దార్లు ఉండాల్సి. కానీ జిల్లాలో ఆ పరిస్థితి లేదు. కాగా ఇప్పటికే భామిని, వీరఘట్టం, గరుగుబిల్లి మండలాలకు తహసీల్దార్లు లేరు. ఇటీవల బలిజిపేట, జియ్యమ్మవలస, పాచిపెంట, పార్వతీపురం తహసీల్దార్లు జి.వి.జనార్దన్, సీతారామయ్య, దూసి రవి, పెద్దింటి సోమేశ్వరరావు, సబ్ కలెక్టర్ ఏవో ఎం.భుజంగరావును విశాఖ, శ్రీకాకుళం జిల్లాలకు బదిలీ చేశారు. పాలకొండ, పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో నలుగురుకు ఇద్దరే ఉన్నారు. కేఆర్ ఆఫీస్ తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. తహసీల్దార్ల పోస్టులను భర్తీ చేయకుండా జిల్లాలో ఉన్న ఐదుగురిని ఇతర జిల్లాలకు బదిలీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ పలుకుబడితో కొందరు, మరికొందరు బదిలీలు చేయించుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్న తరుణంలో ప్రజలకు మెరుగైన సేవలు ఎలా అందుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఇతర శాఖల్లో...

- ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల్లోనూ పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు లేరు. ఆర్‌అండ్‌బీ జిల్లా ఇంజనీరింగ్ అధికారి జేమ్స్‌కు బదిలీ అయినప్పటికీ.. ఆ స్థానంలో ఇంకా ఎవర్నీ నియమించలేదు. కానీ సాలూరు డివిజన్ ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.
- కొద్దిరోజులుగా జిల్లా పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాఖ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఆ స్థానంలో ఇన్‌చార్జిగా పాలకొండ పీఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉన్నారు.
- గిరిజనసంక్షేమ ఇంజనీరింగ్ శాఖకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులో కుమార్‌ను నియమించారు. ఇంకా ఆయన బాధ్యతలు స్వీకరించలేదు.
- డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌వో, జిల్లా మలేరియా అధికారి, పార్వతీపురం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో పోస్టుల భర్తీతో పాటు వివిధ ప్రోగ్రాం అధికారులను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం ఆయా పోస్టులకు ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. మొత్తంగా వైద్య సేవలు, సిబ్బంది పనితీరును పర్యవేక్షించే వారే కరువయ్యారు. వైద్య ఆరోగ్యశాఖలో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ఎందుకు భర్తీ చేయడం లేదో ఉన్నతాధికారులే తెలియజేయాల్సి ఉంది. జిల్లాలో కొంతమంది పీహెచ్‌సీ డాక్టర్లను ప్రోగ్రాం అధికారులుగా నియమించడంతో ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదని వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.
- హౌసింగ్ శాఖలో కొద్ది కాలంగా జిల్లా మేనేజర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.
- డీఆర్వో పోస్టు కూడా ఎన్నికల కోడ్ అమలు నుంచి ఖాళీగానే ఉంది. అప్పటి నుంచి కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడు డీఆర్వోతో పాటు హౌసింగ్ డీఎం ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
- డీఆర్‌డీఏ తదితర శాఖలకు కూడా పూర్తిస్థాయి అధికారులు లేరు. కొన్ని శాఖల్లో ఇన్‌చార్జిలు లేదా రెగ్యులర్‌గా వ్యవహరిస్తున్న కొంతమంది అధికారులకు ఇతర జిల్లాల నుంచి జీతాలు పొందుతున్న పరిస్థితి ఉంది.



పార్వతీపురంలో అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు

సొంత భవనాలు ఏవీ?

జిల్లా ఏర్పడి మూడేళ్లవుతున్నా.. సుమారు 30 శాఖలకు సొంత భవనాలు లేవు. నేటికీ అద్దె భవనాల్లోనే విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి. మరికొన్ని శాఖల కార్యాలయాలకు మౌలిక వసతుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. కొన్నిచోట్ల మురుగుదొడ్లు కూడా లేవు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగులు, అధికారులకు అవస్థలు తప్పడం లేదు.

ఐటీడీఏల్లో ఇలా..

సీతంపేట రూరల్: సీతంపేట ఐటీడీఏకు పీవోగా ఇప్పట్లో రెగ్యులర్ ఐఏఎస్ నియామకమయ్యేట్లు కనిపించడం లేదు. ఇన్‌చార్జిలతోనే కాలం నెట్టుకొస్తుండడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదట్లో ఐఏఎస్ అధికారి అయిన శుభం బన్సాల్ సీతంపేట ఐటీడీఏకు పీవోగా ఉండేవారు. అప్పట్లో ఆయన వ్యక్తిగత కారణాలతో కొద్ది రోజులు సెలవుపై వెళ్లారు. ఇంతలో ఐఏఎస్‌ల బదిలీల ప్రక్రియ ప్రారంభమవడంతో ఆయన తిరుపతి జిల్లాకు కలెక్టర్‌గా వెళ్లిపోయారు. పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. నెల రోజుల తర్వాత జాయింట్ కలెక్టర్ శోభికను ఇన్‌చార్జి పీవోగా నియమిస్తూ.. కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఐదు రోజుల తర్వాత ప్రభుత్వం మరోసారి ఐఏఎస్‌ల బదిలీ చేపట్టింది. దీంతో సీతంపేట ఐటీడీఏకు రెగ్యులర్ పీవోగా (ఐఏఎస్) టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని నియమించింది. అయితే ఆయన పీవోగా కేవలం 20 రోజులు మాత్రమే ఇక్కడ పనిచేశారు. ప్రమోషన్‌పై జేసీగా బదిలీ అయ్యారు. ఆ తర్వాత పాలకొండ ఆర్డీవో వీవీ రమణకు పీవోగా ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. ఇరవై రోజుల అనంతరం ఆయన బదిలీపై వెళ్లిపోయారు. తాజాగా పాలకొండ సబ్ కలెక్టర్‌గా సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి(ఐఏఎస్)ను ప్రభుత్వం నియమించగా.. ఆయనకే సీతంపేట ఐటీడీఏ పీవోగా అదనపు బాధ్యతలను అప్పగించారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం ఐటీడీఏకి కూడా పూర్తిస్థాయి ప్రాజెక్టు అధికారి లేరు. ప్రస్తుతం పార్వతీపురం సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ ఇన్‌చార్జి పీవోగా వ్యవహరిస్తున్నారు. రెగ్యులర్ పీవో లేని కారణంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు పాలనాపరంగా కూడా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. గిరిజన గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పన, విద్య, వైద్యం, ఆశ్రమ పాఠశాలల్లో పరిస్థితులు, నిరుద్యోగ యువతకు డీఎస్సీలో ఉచిత శిక్షణ, గిరిజన గర్భిణులకు వసతిగృహాలు, పథకాల అమలను పర్యవేక్షించేందుకు కచ్చితంగా ఐఏఎస్ స్థాయి అధికారులను రెగ్యులర్ పీవోగా నియమించాల్సి ఉంది. అయితే ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై గిరిజనులు, పలు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.



సీతంపేట ఐటీడీఏ



పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం

ప్రైవేట్ ఆసుపత్రుల్లో సేవలపై కమిటీ

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో సేవలపై కమిటీని నియమించి తనిఖీలు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖాధికారులతో సమీక్షించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో సౌకర్యాలు, ఆధునిక యంత్రాలు, మందులు గమనించాలన్నారు. ముఖ్యంగా అనస్థీషియా సేవలను నిశితంగా పరిశీలించి నివేదికలు తయారు చేయాలన్నారు. చాలాచోట్ల అనస్థీషియా లేకుండానే సేవలు అందిస్తున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయని తెలిపారు. జిల్లాలో మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలన్నారు. గర్భిణులను ఆసుపత్రిలో చేర్చేటప్పుడు మంచి వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో ఒక నెలలో జరిగిన ప్రసవాలు, అందులో హైరిస్క్ కేసులను గుర్తించి నివేదికలు అందించాలని ఆదేశించారు.

వ్యాధుల నివారణకు ప్రణాళికలు

వ్యాధుల నివారణకు ముందస్తు ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో కిడ్నీ, కళ్లు, గుండె, నరాల సంబంధిత వ్యాధులు నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏరియా, సామాజిక ఆసుపత్రుల సూపరింటెండెంట్లకు సూచించారు. వచ్చే ఏడాది మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఇప్పటినుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి, జిల్లా టీబీ నివారణాధికారి ఎం.నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహన్‌రావు, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయ అధికారి రఘుకుమార్, డీఎంవో వై.మణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

క్యూ ఆర్ కోడ్‌పై ప్రచారం

స్వర్ణాంధ్ర-2047పై ప్రజల సలహాలు, సూచనలను కోరుతూ రూపొందించిన క్యూఆర్ కోడ్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. విజన్ డాక్యుమెంట్‌కు సంబంధించి జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించాలన్నారు. ప్రతిచోటా ప్రభుత్వం రూపొందించిన విజన్ డాక్యుమెంట్ చదివి వినిపించాలని, వీడియో ప్రదర్శించాలని, ప్రజల అభిప్రాయాలు సేకరించాలని సూచించారు. రాబోయే ఐదేళ్లకు మండల స్థాయి యాక్షన్ ప్లాన్ తయారు చేసి ఈనెల 30న అందిం చాలని ఆదేశించారు. ఒకటో తేదీన పింఛన్ల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు వై.సత్యం నాయుడు, కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- ఎస్పీ మాధవరెడ్డి



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ

బెలగాం, సెప్టెంబరు 25: పెండింగ్ కేసులపై దృష్టి సారించి నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆదేశించారు. బుధవారం పోలీస్ మల్టీ ఫంక్షన్ హాల్‌లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ల వారీగా యూఐ కేసులు తగ్గించుకోవాలని సూచించారు. హత్యలు, హత్యాయత్నాలు, అమ్మాయిల మిస్సింగ్, ప్రాపర్టీ తదితర కేసులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి త్వరతగతిన కేసులు పరిష్కరించాలని ఆదేశించారు. నేరస్థులు తప్పించుకోకుండా చూడాలన్నారు. హత్య, పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. ప్రాపర్టీ కేసులలో నిందితులను త్వరతగతిన పట్టుకుని రికవరీ చేయాలని తెలిపారు. రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కలిగించి ప్రమాదాలను నియంత్రించాలన్నారు. గంజాయి కేసుల్లో అనుసరించాల్సిన విధివిధానాలను వివరించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చాటిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమీక్షలో ఏఎస్పీ ఓ.దిలీప్ కిరణ్, పార్వతీపురం ఏఎస్పీ సురాన అంకిత మహవీర్, డీఎస్పీ ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పార్కు అభివృద్ధికి చర్యలు

- ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ




ఐటీడీఏ పార్కును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి పీవో

గరుగుబిల్లి, సెప్టెంబరు 25 : తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని ఐటీడీఏ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. బుధవారం పార్కు ప్రాంతం, శిథిలావస్థకు చేరిన సామగ్రి తదితర వాటిని పరిశీలించారు. ఐటీడీఏ పార్కుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. పార్కు ప్రాంతంలో చిన్నారులు ఆడుకొనే సామగ్రి, ఖాళీగా ఉన్న భవనాల్లో గిరిజన మ్యూజియం, అటవీ ఉత్పత్తుల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. నెల రోజుల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చేలా ఆకర్షణీయంగా పార్కును తీర్చిదిద్దాలని సూచించారు. ప్రాజెక్టు పరిధిలో బోటు షికారును కొనసాగించాలన్నారు. పార్కు ప్రాంతంలో పర్యాటకుల కోసం వసతి సౌకర్యం కల్పించాలని తెలిపారు. స్వాగత ద్వారం వద్ద సెల్ఫీ పాయింట్‌తో పాటు మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతం పర్యాటకానికి ఎంతగానో అనువుగా ఉందన్నారు. ఈ పరిశీలనలో సహాయ ఇంజనీర్ తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.

పర్యాటక దినోత్సవానికి సిద్ధం

సీతంపేట రూరల్: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో మాట్లాడుతూ... 'పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆడలి వ్యూపాయింట్, రెస్టారెంట్, నైట్ క్యాంపింగ్ టెంట్లు ప్రారంభిస్తాం. ఫుడ్ ఫెస్టివల్, వివిధ స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తాం. సాయంత్రం నాలుగు గంటలకు ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లోని ఐలవ్ సీతంపేట పేరుతో ఫొటో పాయింట్‌ను ప్రారంభిస్తాం. 5డీ థియేటర్‌ను పునః ప్రారంభిస్తాం. టీపీ కళాకారులు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో ఫ్యాషన్‌షో, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సవర ఆర్ట్స్ స్టాల్స్, చిన్న పిల్లల కోసం వివిధ క్రీడల స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తాం. సీతంపేట ఏజెన్సీలో మరిన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం. కాగా ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీతంపేట పార్క్ అభివృద్ధికి రూ.1.50 కోట్లు మంజూరు చేశారు.' అని తెలిపారు. అనంతరం ఆడలి వ్యూపాయింట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏపీవో చిన్నబాబు, డీపీవో సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

డంగభద్రలో ఏనుగులు



కొమరాడ, సెప్టెంబరు 25 : నాగావళి నదికి తూర్పు వైపున ఉన్న ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా సంచరించిన ఏనుగులు తాజాగా కొమరాడ మండలం డంగభద్ర సమీపంలో హల్‌చల్ చేస్తున్నట్లు బుధవారం అటవీశాఖ సిబ్బంది తెలిపారు. సమీప ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి సమయంలో రైతులు పంట పొలాల్లోకి వెళ్లరాదని తెలిపారు. వాస్తవంగా ఈ ప్రాంతంలో ఏనుగుల సంచారం కొద్ది రోజులుగా లేదు. దీంతో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా గడిపారు. అయితే మళ్లీ ఏనుగుల గుంపు రావడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. అరటి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలను గజరాజులు ధ్వంసం చేసే అవకాశం ఉందని, తక్షణమే వాటిని ఈ ప్రాంతం నుంచి తరలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖాధికారిగా
జయసింహ చౌదరి

పార్వతీపురం, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారిగా కె.జయసింహ చౌదరి నియమితులయ్యారు. అనకాపల్లిలో పనిచేస్తూ రిలీవైన ఆయన పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. కాగా బుధవారం ప్రభుత్వం జయసింహ చౌదరికి మన్యం జిల్లాలో పోస్టింగ్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. త్వరలో ఆయన విధుల్లో చేరనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

కోటదుర్గమ్మ ఆలయ ఈవోగా సూర్యనారాయణ

పాలకొండ: పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానం రెగ్యులర్ కార్యనిర్వహణాధికారిగా వీవీ సూర్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ ఈవోగా పనిచేసిన మురళీకృష్ణకు అనకాపల్లి కాశీ విశ్వేశ్వర గ్రూపు ఆలయాల ఈవోగా బదిలీ అయ్యింది. కాగా నూతన ఈవో సూర్యనారాయణ శంబర పోలమాంబ, తోటపల్లి ఆలయాలకు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.

కొలిక్కిరాని సరిహద్దు పంచాయితీ

- దిమ్మిడిజోల వంశధార తీరంలో ఇసుక ర్యాంప్ వద్ద రీసర్వే
- ఆంధ్ర-ఒడిశా సెటిల్‌మెంట్‌పై చర్చ
- కలెక్టర్‌కు నివేదిస్తామన్న పాలకొండ సబ్ కలెక్టర్

భామిని: భామిని మండలం దిమ్మిడిజోల సమీపంలో వంశధార తీరం వద్ద ఆంధ్రా-ఒడిశా సరిహద్దు వివాదం కొలిక్కిరాలేదు. బుధవారం పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఏడీఎం ఎస్.రాజేంద్ర మిశ్రా, మైనింగ్ అధికారి దీపెన్‌పరిడా ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఉభయ రాష్ట్రాల సెటిల్‌మెంట్ రికార్డులు, వంశధార నది సరి హద్దుపై చర్చించారు. ఇసుక ర్యాంపు వద్ద రీ సర్వే చేశారు. ఒడిశాకు చెందిన భూభాగంలోనే ఇసుక ర్యాంపు ఉందని ఆ రాష్ట్ర అధికారులు తెలిపారు. దీనిపై పాలకొండ సబ్ కలెక్టర్ అభ్యంతరం తెలిపారు. భామిని మం డలం లివిరి రెవెన్యూ గ్రామ పరిధిలోనే నదీతీర ప్రాంతం, ర్యాంపు ఉందని, దీనికి సరిహద్దుగా ఒడిశాకు చెందిన బుదర, బొత్తవ, కితంగి గ్రామాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం ఇరు రాష్ట్రాల అధికారుల స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. వాటిని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు నివేదించనున్నట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. రీసర్వే సమాచారం తెలుసుకున్న లివిరి, దిమ్మిడిజోల గ్రామస్థులు అక్కడకు చేరుకున్నారు. ఆంధ్రా వైపు ఉన్న వంశధార నదీ తీరం నుంచి ఒడిశా వారు ఇసుక తరలిస్తున్నారని సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. డివిజన్ సర్వేయర్ వెంకటరావు, తహసీల్దార్ రాజశేఖర్, మైన్స్ ఏడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మ్యాప్ పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ తదితరులు

నా దృష్టిలో... వేడుక అంటే ఇదే



నటి శోభితా ధూళిపాళ, నాగచైతన్య ఇటీవలే నిశ్చితార్థం చేసుకున్న సంగతి విదితమే. ఎంతో సింపుల్‌గా జరిగిన ఈ ఎంగేజ్‌మెంట్ గురించి ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ వేడుకను గ్రాండ్‌గా చేసుకోవాలని ముందుగా ప్లాన్ చేయలేదు. ఇలా ఉండాలి.. అలా ఉండాలి అని కలలు కనలేదు. జస్ట్.. జీవితంలో అతి ముఖ్యమైన ఆ మధుర క్షణాలని ఆస్వాదించాలని అనుకున్నాను. తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా ఇలాంటి వేడుకలు జరగాలని కోరుకునేదాన్ని. ఇది ఇలాగే జరిగింది. కాబట్టి ఈ వేడుక నిరాడంబరంగా జరిగిందని అనుకోవట్లేదు. నా వరకూ ఇదో పర్ఫెక్ట్ పద్ధతిలో సాగిన వేడుక" అని చెప్పారు.

ఒక్క రాత్రిలో జరిగే కథ



ఫీల్‌గుడ్ ప్రేమకథా చిత్రం '96'తో అందరినీ విశేషంగా ఆకట్టుకున్న దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సత్యం సుందరం'. కార్తి, అరవింద స్వామి ప్రధాన పాత్రలు పోషించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్ మీడియాతో ముచ్చటించారు. "ఇదో బ్యూటిఫుల్ ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాకు కార్తి, అరవింద్ స్వామి బిగ్గెస్ట్ స్ట్రెంగ్త్. వారిద్దరూ అంగీకరించకుంటే.. ఈ ప్రాజెక్ట్‌ను మొదలెట్టేవాణ్నే కాదు. ఇది ఒక్క రాత్రిలో జరిగే కథ. సక్సెస్‌ను, ఫెయిల్యూర్‌ని నేను పట్టించుకోను. సినిమా చేసేటప్పుడు వచ్చే సంతృప్తి మాత్రమే ముఖ్యం. ఈ సినిమా విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను. ప్రొడ్యూసర్స్ సూర్య, జ్యోతిక మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. టెక్నికల్‌గా సినిమా ఉన్నతంగా ఉంటుంది. గోవింద్ వసంత ఇచ్చిన సంగీతం అద్భుతంగా ఉంటుంది. తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరించే సినిమా ఇది" అని చెప్పారు.

నేరస్థుల పాలిట యముడు



'జై భీమ్' ఫేమ్ టీ.జే. జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (ద హంటర్). ఇందులో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషించారు. 33 ఏళ్ల తర్వాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కలసి నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. తాజాగా, రజనీ పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ ఓ ప్రివ్యూను విడుదల చేశారు. ఇందులో నేరస్థుల పాలిట యముడిగా.. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా.. ఆయన పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో హింటిచ్చారు. అలాగే, సినిమాలోని ముఖ్య పాత్రధారుల్ని ఈ వీడియోలో పరిచయం చేశారు. దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది.

ఆ వీధికి గాయకుడు బాలు పేరు


- సీఎం స్టాలిన్ ఉత్తర్వులు



గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీబీ) వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వాంతన చేకూర్చే కబురందించారు. బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ కోరిక మేరకు స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్ మొదటివీధి పేరును మార్చేందుకు స్టాలిన్ అంగీకరించారు. ఆ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం యేళ్ల తరబడి నివసించిన కామదార్‌నగర్ ఫస్ట్‌స్ట్రీట్ పేరును 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్డు'గా మార్చుతున్నట్లు ప్రకటించారు. ఎస్పీబీ భౌతికంగా లేకపోయినా వివిధ భాషల్లో ఆయన పాడిన పాటల ద్వారా అభిమానుల మనస్సుల్లో చిరంజీవిగా సుస్థిరంగా నిలిచి ఉంటారని స్టాలిన్ ఈ సందర్భంగా కొనియాడారు.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

కేరళలో ముగించారు



శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ('శర్వా 37'- వర్కింగ్ టైటిల్) కీలక షెడ్యూల్ పూర్తయింది. పది రోజుల పాటు కేరళలో జరిగిన షెడ్యూల్‌లో పాట, ఫైట్ సీక్వెన్స్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రంలో శర్వానంద్‌కు జంటగా సాక్షి వైద్య, సంయుక్త నటిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ వీఎస్

దేవర టికెట్ ధరల పెంపు 10 రోజులే



జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా టికెట్ల ధరల పెంపును 10రోజులకే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు ఉత్తర్వులు ఇస్తున్నామని పేర్కొంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ నెల్లూరుకు చెందిన పి. శివకుమార్ రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ నెల 27న విడుదల కానున్న దేవర సినిమా ప్రత్యేక ప్రదర్శనలతో పాటు టికెట్ ధరలను పెంపునకు అనుమతిస్తూ నిబంధనలకు లోబడి టికెట్ ధరలు నిర్ణయించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది శివప్రసాద్ రెడ్డి వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 13 ప్రకారం సినిమా విడుదలైన నాటి నుంచి పదిరోజుల పాటు మాత్రమే టికెట్ ధరల పెంపునకు వెసులుబాటు ఉందని న్యాయస్థానం గుర్తు చేసింది. ప్రభుత్వం జారీ చేసిన మెమోపై స్పష్టతనిస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి, చిత్ర నిర్మాతకు నోటీసులు జారీ చేసింది. విచారణను వారంరోజులకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి వాదనలు వినిపిస్తూ.. టికెట్ ధరల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోలో పెంపు ఎన్ని రోజులో ప్రస్తావించలేదన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

నటి ఊర్మిళ విడాకులు



'రంగీలా, భారతీయుడు' లాంటి హిట్ చిత్రాలతో ప్రేక్షక హృదయాలను కొల్లగొట్టారు నటి ఊర్మిళా మతోండ్కర్. కశ్మీర్‌కు చెందిన వ్యాపారవేత్త మోసిన్ అక్తర్ మీర్‌ను ఆమె 2016లో పెళ్లాడారు. అయితే ఇప్పుడు వీరి వైవాహిక జీవితం ఒడిదుడుకులు ఎదుర్కొంటోందనీ, త్వరలోనే ఇద్దరూ విడిపోబోతున్నారని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఊర్మిళ నాలుగు నెలల క్రితమే విడాకుల కోసం ముంబై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు జాతీయ మీడియా పేర్కొంది.

ఇన్ ప్రోగ్రెస్



విభిన్నంగా 'క'

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌తో సుజిత్, సందీప్ దర్శకులుగా పరిచయమవుతున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తయిందనీ, ఈ చిత్ర నిర్మాణం తమకు మధురమైన అనుభూతులు మిగిల్చిందనీ, జీవితాంతం గుర్తుండిపోయే అనుభవాలను ఇచ్చిందనీ వారు పేర్కొన్నారు. సినిమా సాధించే హిట్ కోసం ఎదురుచూస్తున్నామని సుజిత్, సందీప్ చెప్పారు. టైటిల్‌కు తగ్గట్లుగానే సినిమా కూడా విభిన్నంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ విడుదల చేస్తున్నారు..

ఆ శత్రువుని వెంటేసుకుని పుడతాడు



'మనిషి పుట్టడంతోనే జీవితం అనే శత్రువుని వెంటేసుకుని మరీ పుడతాడు. దాని మీద గెలిచినోడే గొప్పవాడవుతాడు. ఓడినోడు మధ్యలోనే..' అనే డైలాగ్‌తో మొదలయ్యే 'కలి' చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను దర్శకుడు ప్రశాంత్ వర్మ విడుదల చేశారు. ప్రిన్స్, నరేశ్ అగస్త్య ఇందులో హీరోలుగా నటించారు. శివశేషు దర్శకత్వంలో లీలా గౌతమ్ వర్మ నిర్మించారు. అక్టోబర్ నాలుగున సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇది సైకలాజికల్ థ్రిల్లర్ అనీ, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు చెప్పారు. కష్టాలతో ఆత్మహత్య చేసుకోవాలనుకునే శివరామ్ (ప్రిన్స్) ఇంటికి అపరిచిత వ్యక్తి (నరేశ్ అగస్త్య) వస్తాడు. అతను వచ్చాక శివరామ్ జీవితంలో ఎదురైన అనూహ్య సంఘటనలు ఏమిటన్నవి ఆసక్తికరంగా ఉంటాయని దర్శకుడు శివశేషు చెప్పారు.

వారణాసి నేపథ్యంలో



శివ తత్వాన్ని వివరిస్తూ వారణాసి బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకుంటున్న 'లైఫ్' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి పవన్ కేతరాజు దర్శకుడు. కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మాతలు. 'ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. హీరో తండ్రి పాత్రలో ఎస్పీ చరణ్ నటించారు. నవాబ్ షా కీలక పాత్ర పోషించారు. శ్యామ్ కె నాయుడు ఫొటోగ్రఫీ, మణిశర్మ సంగీతం ఆకట్టుకుంటాయి' అని దర్శకుడు చెప్పారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

అమరావతికి ఆహ్వానం



శివ కంఠమనేని, ధన్యా బాలకృష్ణ ప్రధాన పాత్రధారలుగా తెరకెక్కుతోన్న చిత్రం 'అమరావతికి ఆహ్వానం'. చిత్రీకరణ మొదలైంది. లైట్ హౌస్ సినీ మేజిక్ పతాకంపై కేఎస్ శంకర్ నిర్మిస్తున్నారు. జి. వెంకట కృష్ణన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్తేర్, హరీష్, భద్రం కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: విష్ణు భరద్వాజ్, సినిమాటోగ్రఫీ: ప్రభాకర్ రెడ్డి

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా రూపుదిద్దుకున్న 'జ్యూయెల్ థీఫ్' చిత్రం సెన్సార్ పూర్తయింది. ప్రేమ, అజయ్, పృథ్వీ, శివారెడ్డి తదితరులు నటించిన ఈ సినిమాను పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'ఇదో సస్పెన్స్ థ్రిల్లర్. యువతకు బాగా నచ్చుతుంది. శ్రీలేఖ అందించిన పాటలు ఆకట్టుకుంటాయి. యాక్షన్ పార్ట్ హైలైట్ అవుతుంది' అని చెప్పారు.

ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు



పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్- షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. • వెబ్‌సైట్: ftii.ac.in

బేసిక్ కోర్స్ ఇన్ డిజిటల్ ఫిల్మ్ మేకింగ్

కోర్సు వ్యవధి అయిదు రోజులు. మొత్తం 45 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. నవంబరు 4 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు. కనీసం ఆరోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 11 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఈ కోర్సులో ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్, ఫిల్మ్ లాంగ్వేజ్ అండ్ స్టోరీ టెల్లింగ్ టెక్నిక్స్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, ఆర్కైవల్ టెక్నిక్స్ తదితర అంశాలు బోధిస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.7000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14

ఫౌండేషన్ కోర్స్ ఇన్ స్క్రీన్‌ప్లే రైటింగ్

కోర్సు వ్యవధి పదకొండు రోజులు. మొత్తం 24 సీట్లు ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో షార్ట్ ఫిల్మ్ స్ట్రక్చర్, రైటింగ్ ఫర్ స్క్రీన్‌ప్లే, టైమింగ్ ఇన్ సినిమా, అరిస్టాటిల్ పొయిటిక్స్ ఫర్ స్క్రీన్ రైటర్స్, సీన్ కన్‌స్ట్రక్షన్, బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్స్, మిస్టరీ/సస్పెన్స్/సర్‌ప్రైజ్/ఐరనీ టూల్స్, డెవలపింగ్ షార్ట్ ఫిల్మ్ స్టోరీ అండ్ స్క్రీన్‌ప్లే తదితర అంశాలు బోధిస్తారు. నవంబరు 11 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.17,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 21

బేసిక్ కోర్స్ ఆన్ స్మార్ట్‌ఫోన్ డాక్యుమెంటరీ

కోర్సు వ్యవధి ఎనిమిది రోజులు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో స్మార్ట్‌ఫోన్‌తో ఫిల్మ్ మేకింగ్, ఎడిటింగ్ విధానాలు; క్వాలిటీ వీడియోలు తీయడం; ఫోన్‌ను వీడియో కెమెరాగా

దిక్సూచి
DIKSUCHI

వినియోగించడం; సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవిధంగా డాక్యుమెంటరీలు, షార్ట్ వీడియోలు తీయడం; డాక్యుమెంట్ మెమొరీస్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 20 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

- **కోర్సు ఫీజు:** రూ.9,800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30

బేసిక్ యాక్టింగ్ వర్క్‌షాప్

ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. దీని వ్యవధి పదకొండు రోజులు. రోజుకు రెండు బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు మరో బ్యాచ్ నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి. కనీసం మూడో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎనిమిది నుంచి పన్నెండేళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉదయం బ్యాచ్‌కు, పదమూడు నుంచి పదిహేడేళ్ల మధ్య వయసున్నవారు సాయంత్రం బ్యాచ్‌కు హాజరు కావాలి. ఈ కోర్సులో థియేటర్ గేమ్స్, ఇంప్రూవైజేషన్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రైటింగ్, ఇమాజినేషన్, నవరసాలు, సీన్‌వర్క్, వాయిస్ అండ్ బ్రీతింగ్, అవేర్‌నెస్, మెమొరీ, కెమెరా వర్క్, ఆడిషన్ టెక్నిక్స్, ఆడిషన్ ప్రాక్టీస్, మ్యూజిక్ బేస్డ్ ఇమాజినేషన్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 29 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

- **కోర్సు ఫీజు:** రూ.10,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 7

సీడీఎఫ్‌డీలో రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ)- 'రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్(పీహెచ్‌డీ)-1-2025'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్, మోడర్న్ బయాలజీ సంబంధిత అంశాలపై రీసెర్చ్ వర్క్ ఉంటుంది. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అభ్యర్థులు కోర్సు పూర్తయ్యే వరకు క్యాంపస్‌లోనే ఉండాలి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండు రౌండ్లు ఉంటాయి. నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వీడియో కాన్ఫరెన్స్ ఇంటర్వ్యూ, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. కోర్సులో చేరినవారికి రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)లో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తారు.

రీసెర్చ్ విభాగాలు: సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ, డిసీజ్ బయాలజీ, జెనెటిక్స్, మాలిక్యులర్ మైక్రో బయాలజీ, ఇమ్యూనాలజీ.

అర్హతలు: సైన్స్, టెక్నాలజీ, అగ్రికల్చర్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/ ఐసీఎంఆర్/ఇన్‌స్పయిర్/జెస్ట్/యూజీసీ-ఆర్‌జీఎన్‌ఎఫ్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హత పొంది ఉండాలి. జేఆర్ఎఫ్ అర్హత లేని అభ్యర్థులను ఇంటర్వ్యూకి అనుమతించరు. ఐసీఎంఆర్ నుంచి రెండేళ్ల ఫండెడ్ ప్రాజెక్ట్ స్కీమ్ కింద జేఆర్ఎఫ్ పొందినవారు, బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసి డీబీటీ జేఆర్ఎఫ్ నెట్ అర్హత ఉన్నవారు, డీబీటీ-బీ కేటగిరీ కింద జేఆర్ఎఫ్ నెట్ రాసినవారు, సీఎస్ఐఆర్-యూజీసీ(నెట్) ద్వారా ఎల్ఎస్ అర్హత పొందినవారు దరఖాస్తుకు అనర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 11
- **వెబ్‌సైట్:** www.cdfd.org.in

ఐఐటీ మద్రాస్‌లో ఈఎంబీఏ

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం) నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్) - ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(ఈఎంబీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వారాంతాల్లో క్లాస్ రూమ్ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మూడు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ డిస్కషన్స్, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఎలక్టివ్ కోర్సులు ఉంటాయి. తొమ్మిది రోజుల ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ లెర్నింగ్ కోర్సు జతగా ఉంటుంది. ఇది 'గ్లోబల్ లీడర్‌షిప్ అండ్ కల్చరల్ ఇంటెలిజెన్స్'కు సంబంధించి ఉంటుంది. దీనిని బ్రస్సెల్స్-బెల్జియం; లిల్లీ & పారిస్-ఫ్రాన్స్‌లోని ఎస్ఈజీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిసెంబరు 31 నాటికి కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 20
- **వెబ్‌సైట్:** doms.iitm.ac.in

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈగా కాంతిమతి

విజయనగరం టౌన్: రోడ్లు, భవనాల శాఖ ఎస్‌ఈగా కె.కాంతిమతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఎస్‌ఈగా పనిచేస్తున్న విజయరత్నం విజయవాడకు బదిలీపై వెళుతున్నారు. ఆ స్థానంలో విశాఖపట్నం జోనల్ ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈగా పని చేస్తున్న కాంతిమతిని నియమించారు విజయనగరం ఆర్‌అండ్‌బీ ఈఈగా ఎం.జేమ్స్‌ను బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

కళా ప్రదర్శనలకు అవకాశం

కలెక్టరేట్: విజయనగరం ఉత్సవాల సందర్భంగా అక్టోబరు 13, 14 తేదీల్లో స్థానిక ఆనంద గజపతి కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెన్యూ ఇన్‌చార్జీ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఉమాశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు తమ వివరాలను స్థానిక మహారాజా సంగీత నృత్య కళాశాలలో ఈ నెల 28వ తేదీలోగా అందజేయాలని వివరించారు.

రిజిస్ట్రేషన్లకు అంతరాయం

బొబ్బిలి: జిల్లా వ్యాప్తంగా మంగళ, బుధవారాలలో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఇన్నాళ్లూ ఉమ్మడి జిల్లాల పరిధిలోనే ఉన్నందున లాగిన్ కాలేదు. ఆ శాఖలో పెద్దఎత్తున అధికారులు, ఉద్యోగుల బదిలీలు కావడంతో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. బుధవారం మధ్యాహ్నం నాటికి ఈ సమస్య పరిష్కారం కావడంతో రిజిస్ట్రేషన్లు యధాతథంగా కొనసాగినట్టు నూతనంగా సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

బ్యాడ్మింటన్ జనరల్ సెక్రటరీగా లక్ష్మణరావు

శృంగవరపుకోట: జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా శృంగవరపుకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జి.లక్ష్మణరావు ఎంపికయ్యారు. బుధవారం బొబ్బిలిలో ఈ సంఘ ఎన్నికలు జరిగాయి.

29న జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు

ఈనెల 29న నెమలం జడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్ 19 బాల, బాలికల జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీనివాసరావు, జి.లక్ష్మణరావు ఓ ప్రకటనలో తెలిపారు.

హిందూ బోర్డు ఏర్పాటు చేయండి

శృంగవరపుకోట రూరల్: దేశంలో సనాతన ధర్మ పరిరక్షణకు హిందువుల కోసం హిందూ బోర్డు ఏర్పాటు చేయాలని జిల్లా పురోహిత సమాఖ్య ప్రధాన కార్యదర్శి దొంతుకుర్తి సాయికుమార్‌శర్మ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బొడ్డవర గ్రామంలో మాట్లాడుతూ సనాతన ధర్మం కాపాడటం కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేస్తున్న కృషికి ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆయనకు బ్రాహ్మణ సమాఖ్య మద్దతుగా ఉంటుందన్నారు.

అధికారులపై జడ్పీ చైర్మన్ ఆగ్రహం

లక్కవరపుకోట (వేపాడ): మండలంలో ప్రభుత్వ అధికారుల తీరు సరిగా లేదని, పనితీరు మార్చుకోవాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎంపీపీ సత్యవంతుడు అధ్యక్షతన జరిగిన వేపాడ మండల పరిషత్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక నేతలు చేసిన ఫిర్యాదుల మేరకు అధికారులపై మండిపడ్డారు. వెలుగు, విద్యుత్, పంచాయతీ, వ్యవసాయ తదితర శాఖల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి సాయం

లక్కవరపుకోట (వేపాడ): ఇటీవల విశాఖ ఫార్మాసిటీలో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన సోంపురం గ్రామానికి చెందిన జాగరపు ప్రకాశ్‌కు బుధవారం రూ.లక్ష సాయాన్ని అందజేశారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను బాధితుడికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిరోధంపై అవగాహన

బాడంగి: స్థానిక జెడ్పీ పాఠశాలలో బొబ్బిలి సీఐ కె.నారాయణరావు విద్యార్థులకు మత్తు పదార్థాల నిరోధంపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా చర్యలు, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ తారకేశ్వరరావు, పోలీసు సిబ్బంది, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుపై శ్రద్ధ పెంచాలి

విజయనగరం దాసన్నపేట: ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు చదువు పట్ల శ్రద్ధ పెంచడమే ఐసీఐ విజయనగరం హరివిల్లు క్లబ్ లక్ష్యమని సంస్థ అధ్యక్షులు కేవీఎస్ సూర్య రామారావు చెప్పారు. బుధవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన మెగా ఇంపాక్ట్ విజయనగరం కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు గంపా నాగేశ్వరరావు హరివిల్లు విజయనగరం క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీఐ అనుబంధ సంస్థగా విజయనగరంలో నాలుగు క్లబ్‌లు ప్రారంభించామని తెలిపారు. వీటి ద్వారా ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులకు చదువు పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు జె.శ్రీనివాస్, కె.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జీవో ప్రకారం జీతాలు చెల్లించండి



డ్రైవర్ల దీక్షలో పాల్గొన్న యూనియన్ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం క్లాప్ వెహికల్ డ్రైవర్ జీతాలు జీఓ నెంబరు 7 ప్రకారం చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి.సుబ్బరాయుడు కోరారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద డ్రైవర్లు సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నెంబరు 7 ప్రకారం డ్రైవర్లకు రూ.18,500 చెల్లించాలని ఇస్తుంటే... కాంట్రాక్టర్లు కొంత మింగేస్తూ... రూ.10 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు రంగరాజు, బుగత అశోక్, కామేష్, రామకృష్ణతో పాటు డ్రైవర్లు పాల్గొన్నారు.

మరో 11 మంది ఆస్పత్రి పాలు

ఎస్సీ వసతిగృహం విద్యార్థులకు కుదుటపడని ఆరోగ్యం


విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

శృంగవరపుకోట: స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహంలో అనారోగ్యంతో బాధ పడుతున్న విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం 16 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్నారు. ఆదివారం ఆహారం కలుషితం కావడంతో ఇద్దరు విద్యార్థులకు వాంతులు, విరేచనాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం ముగ్గురు, బుధవారం 11 మంది వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరారు. వసతి గృహం వద్దకు వాహనం వేళ్లే దారి లేకపోవడంతో కొట్టాం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ శంకర్ ద్విచక్ర వాహనంపై ఆసుపత్రిలో చికిత్స కోసం తీసుకొచ్చారు. వీరిలో నలుగురు పరిస్థితి కుదుట పడడటంతో డిశ్చార్జి చేశారు. మిగిలిన 12 మందిలో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం విజయనగరం కేంద్రాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 10 మంది విద్యార్థులు ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పరామర్శించారు. డీసీహెచ్, డీఎంహెచ్‌ఓలతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. వసతి గృహాన్ని పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించారు. అన్నం ముద్దగా ఉండడాన్ని గుర్తించారు. ఆహారంలో నాణ్యత లోపిస్తే సహించబోమని హెచ్చరించారు. ఆమెతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామానందం ,మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, పెదగాడి రాజు, తహసీల్దార్ అరుణ కుమారి పాల్గొన్నారు.

న్యూయార్క్‌లో మంత్రి కొండపల్లి

వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశం


వివిధ రంగాల ప్రతినిధులతో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ సాధికారిత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అమెరికాలోని న్యూయార్క్ నగరంలో పలు దేశాలకు చెందిన వాణిజ్య, ఎన్‌జీవో ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. జనరల్, అట్లాంటిక్ ఫౌండేషన్ ప్రతినిధి కారా బార్నెట్, ములగో ఫౌండేషన్ సీఈవో కెవీన్‌స్టర్, బీయాండ్ నెట్ జీరో చైర్మన్ లార్డ్ జాన్ బ్రౌన్ తదితరులతో చర్చలు జరిపారు. వివిధ వాణిజ్య, పెట్టుబడి అవకాశాల గురించి వారి మధ్య చర్చ సాగింది. రైతుల సంక్షేమం, వాతావరణ మార్పుల నియంత్రణ, కార్యకలాపాల కోసం ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టాల్సిన కార్యాచరణ గురించి ప్రాధాన్యంగా చర్చించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా మెరుగైన అభివృద్ధిని సాధించవచ్చునని ఆయా సంస్థల ప్రతినిధులకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలియజేశారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ

బొబ్బిలి: బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూలులో డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ కనకం సతీష్‌కుమార్ బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ పాఠశాలలో విద్యార్థినులకు లైంగిక వేధింపులు, తోటి ఉపాధ్యాయుల పట్ల బెదిరింపులు వంటివి జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సమావేశం నిర్వహించారు. లైంగిక వేధింపులు, బెదిరింపులు ఉంటే కచ్చితంగా పోరాడాలన్నారు. పోలీసుల పరంగా సహకారం అందిస్తామని చెప్పారు. పాఠశాలపై మహిళా పోలీసులతో ప్రత్యేక నిఘా పెడతామన్నారు. ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరికైనా క్లిష్ట సమస్య వస్తే తమ ఫోన్ నెంబర్లకు నేరుగా కాల్ చేయాలని.. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఆకతాయిలు, ప్రేమ పేరుతో లోబరుచుకునే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 30న బొబ్బిలిలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కార్యక్రమం నిర్వహిస్తామని, నటుడు సాయికుమార్ పాల్గొంటారని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఇంటి విలువను బట్టి పరిహారం: ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

రామభద్రపురం: తారాపురం జాతీయ రహదారి 26 రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇంటి విలువను బట్టి నష్ట పరిహారం అందజేస్తామని బొబ్బిలి ఆర్డీవో సాయిశ్రీ స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం తారాపురం గ్రామం వెళ్లి.. వారితో మాట్లాడారు. రోడ్డు నిర్మాణ పనులకు అడ్డు చెప్పవద్దని సూచించారు. నిర్వాసితులు మాత్రం ప్రభుత్వం కొత్తగా జిరాయితీ స్థలం కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అరకొరగా నష్టపరిహారం ఇవ్వడం వల్ల తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. లబ్ధిదారుల వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని ఆర్డీఓ తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, ప్రజాప్రతినిధులు, నిర్వాసితులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలుకు ఘన నివాళి


బాలు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అభిమానులు

రాజాం: ప్రముఖ నేపథ్య గాయకుడు, దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్థంతిని బుధవారం రాజాంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రెడ్‌క్రాస్ బ్రాంచ్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల సంగీత కళాశాల నిర్వాహకుడు మంతపూడి ప్రసాద్, మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, రోటరీ క్లబ్ కార్యదర్శి గట్టి పాపారావు తదితరులు పాల్గొన్నారు

దోమల నివారణకు చర్యలు చేపట్టండి


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

విజయనగరం రూరల్: దోమలు పెరగకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి భాస్కరరావు చెప్పారు. బుధవారం జొన్నవలస హెచ్‌డబ్ల్యూఎస్ సెంటర్‌ను, గ్రామంలోని పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమల నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రజలను కూడా చైతన్యవంతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాకోడు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ అఖిల, సిబ్బంది మాణిక్యం, రాముడమ్మ, సన్యాసిరావు, అప్పలనాయుడు, ప్రసాద్, కృష్ణ, వింధ్య నాగమణి, ఆశాలు పాల్గొన్నారు.

‘సీబీఎం’ లావాదేవీలపై నిరసన

బొబ్బిలి: స్థానిక సీబీఎం పాఠశాల భవనం, స్థలాలను అక్రమంగా విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం పాఠశాల ముందు బలిజిపేట రోడ్డులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు పి.శంకరరావు మాట్లాడుతూ చారిత్రాత్మకమైన ఈ పాఠశాలను పూర్తిగా మూసివేసేందుకు అధికారులు అండదండలు అందించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలను ఇక్కడి నుంచి తరలిస్తే సహించేది లేదన్నారు. 1.20 ఎకరాల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన దోషులందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకోలో గోపాలం, ఇప్టూ, సీపీఐ నాయకులు ఎం.గోపాలం, మునకాల శ్రీనివాసరావు, రైతు సంఘ నాయకుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, సీబీఎం ట్రస్టు ప్రతినిధులు కె.అదృష్టకుమార్, గొంటి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. ఏఎస్‌ఐ జి.భాస్కరరావు బందోబస్తు నిర్వహించారు.

ఆలయంలో ప్రసాదాల తనిఖీ


లడ్డూలను పరీక్షిస్తున్న ఈశ్వరి

విజయనగరం రింగురోడ్డు: పైడిమాంబ ఆలయంలో ప్రసాదం తయారీ నాణ్యతను అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఈశ్వరి, సిబ్బంది బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లడ్డూల తయారీకి సంబంధించిన నెయ్యి, ఇతర పదార్థాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. కలెక్టర్ అంబేద్కర్ ఆదేశాలతో లడ్డూ నాణ్యత పరీక్షలు నిర్వహించినట్టు ఈశ్వరి తెలిపారు. ఆమె వెంట ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగుల్‌మీరా, సిబ్బంది ఉన్నారు.

6 నుంచి ఏపీటీఎఫ్ మహాసభలు


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

విజయనగరం రూరల్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏర్పాటై 85 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో అక్టోబరు 6 నుంచి మూడు రోజుల పాటు మహాసభలు నిర్వహించనున్నటు రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు తెలిపారు. బుధవారం సంఘ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ మహాసభల్లో విద్యా రంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు ఎ.సదాశివరావు, డి ఈశ్వరరావు, ఎం.బలరామ్‌నాయుడు, ఎన్‌వీ పైడిరాజు, సీహెచ్ పైడితల్లి, కె.సత్యం పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో వనం-మనం

విజయనగరం రూరల్: నగరంలోని 47వ డివిజన్ పరిధిలో వనం-మనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల వరప్రసాద్, షైలిపిల్లి పైడిరాజు, కర్రోతు నర్సింగరావు, వాసు, టి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా బాబ్జీరావు

విజయనగరం క్రైం: ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్‌గా ఎస్‌వీవీఎన్ బాబ్జీరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం గుంటూరు జిల్లాలో డీసీగా విధులు నిర్వహిస్తూ, బదిలీపై ఇక్కడికి వసున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

వంగర: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ షేక్ శంకర్ హెచ్చరించారు. మడ్డువలస ప్రధాన రహదారిలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనదారుల పత్రాలు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

జీతాలు చెల్లించకపోతే సమ్మెకు సిద్ధం

రాజాం: ప్రభుత్వ జీవో మేరకు ప్రతినెలా సక్రమంగా జీతాలు చెల్లించకపోతే అక్టోబరు 1వ తేదీ నుంచి సమ్మెకు వెళ్తామని స్థానిక ఏరియా ఆసుపత్రి సెక్యూరిటీ, శానిటేషన్ వర్కర్లు సంఘ నాయకులు హరి, చంద్ర, వారాలమ్మ, జ్యోతి, మురళి, ఉదయ్ తదితరులు డిమాండ్ చేశారు. బుధవారం ఆసుపత్రి ఆవరణలో ధర్నా చేపట్టారు. ధర్నా చేస్తామని ముందుగా ప్రకటిస్తే ఒక నెల జీతం మాత్రం కంటితుడుపు చర్యగా చెల్లిస్తున్నారని తెలిపారు. దళారి వ్యవస్థను రద్దు చేసి, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారంతా ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.


ధర్నా చేస్తున్న ఏరియా ఆస్పత్రి సిబ్బంది

రీల్స్ తీస్తూ కాలు జారిపడి విద్యార్థి మృతి


పవన్(ఫైల్)

గంట్యాడ: నీటి ప్రవాహంలో ఓ వ్యక్తి రీల్స్ తీస్తున్న క్రమంలో జారిపడి మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... గంట్యాడకు చెందిన రాళ్లపూడి పవన్(16) ప్రభుత్వం జూనియర్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి బుడతనాపల్లి సమీపంలో ఉన్న తమురు గెడ్డ వద్దకు వెళ్లాడు. నీటి ప్రవాహం వద్ద పవన్ రీల్స్ తీస్తున్న క్రమంలో కాలుజారీ పడి గెడ్డలో పడిపోయాడు. వెంటనే స్నేహితులు రక్షించే ప్రయత్నం చేయగా గెడ్డలో కొంత దూరం వెళ్లిపోయాడు.ఈ విషయంను తెలుసుకున్న ఎస్‌ఐ సాయి కృష్ణ, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి సంఘటనా స్థలం వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. పవన్ ఆచూకీ కోసం ప్రయత్నం చేస్తున్న క్రమంలో గంట్యాడ ఎస్సీ కాలనీకి చెందిన కొందరు యువకులు వచ్చి గెడ్డలో దిగి గాలించారు. చివరకు ఓ ప్రాంతంలో పవన్ మృత దేహం లభ్యం కావడంతో ఒడ్డుకు తీసుకుని వచ్చారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయి కృష్ణ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

వీడిన హత్య కేసు మిస్టరీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణ

సాలూరు రూరల్: ఖరాస వలసలో ఈనెల 20న నమోదైన ఖరాసమ్మ అనుమానస్పద మృతి కేసులో మిస్టరీ వీడింది. భర్తే హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు బుధవారం సాలూరు సీఐ పి.రామకృష్ణ విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. ఖరాసవలసలో ఖరాసమ్మ మృతిపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. భర్త బొడ్డుదొర శ్రీనును విచారించగా చున్నీని గొంతుకు బిగించి హత్య చేసినట్లు అంగీకరించాడు. శ్రీను, ఖరాసమ్మ 15 ఏళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే శ్రీను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆమెకు సైతం ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండో భార్యను తన ఇంటి పక్కనే మరో ఇంట్లో కాపురం పెట్టాడు. ఇద్దరి భార్యలు పక్కనే పక్కనే ఉండడంతో ఖరాసమ్మ,శ్రీనుల మధ్య తరచు గొడవలు జరిగేవి. ఖరాసమ్మ పొలం నుంచి వచ్చి రెండో భార్య వద్దకు వెళ్లవద్దంటు శ్రీనుతో గొడవ పడింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న చున్నీతో మొదటి భార్య ఖరాసమ్మను గొంతుకు బిగించి చంపివేసి పారిపోయాడు. ఇంట్లో పడి ఉన్న కోడలును అత్తమామలు సాలూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ విషయాలను వివరి స్తూ వీఆర్వో సమక్షంలో పోలీసులకు లొంగిపోయాడు. ఈ మేరకు నిందితుని అరెస్ట్ చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తెర్లాం: అంట్లావార గ్రామానికి చెందిన కోట రామారావు(62) బుధవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రామారావు తన భార్య సావిత్రమ్మ తో కలసి సాయంత్రం పశువుల కోసం గడ్డి కోసేందుకు పొలం వైపు వెళ్లాడు. తన పొలాన్ని పరిశీలిస్తున్న క్రమంలో గట్టుపైన ఉన్న మోటారు లైను వైరు తెగిపడిన విషయం గమనించక దానిపైన అడుగువేశాడు. దీంతో షాక్‌కు గురై మరణించాడని ఎస్.ఐ. సాగర్‌బాబు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

జియ్యమ్మవలస: మండలంలోని జోగులుడుమ్మ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఓ ప్రైవేట్ స్కూల్ వాహనం బుధవారం రాత్రి ఢీకొనడంతో కుదమ గ్రామానికి చెందిన పి.కృష్ణ(56) మృతి చెందాడు. జియ్యమ్మవలస నుంచి ద్విచ క్రవాహనంపై వస్తున్న కృష్ణను బీజేపురం నుంచి వస్తున్న స్కూల్ వాహనం ఢీకొంది. ఈ మేరకు ఎస్‌ఐ పి.అనీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుని ఆచూకీ లభ్యం

కొత్తవలస: స్థానిక శారదా కర్మాగారానికి చెందిన బొగ్గు యార్డులో లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం ఆచూకీ తెలిసిందని సీఐ షణ్ముఖరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... శారదా కర్మాగారానికి ఒడిశా రాష్ట్రం కటక్ నుంచి ఆరు లారీలలో బొగ్గు వచ్చినట్టు తెలిపారు. మృతదేహంపై ఉన్న ప్యాంటులో సోము నాథ్ పైడా అని రాసి ఉందన్నారు. దాని ప్రకారం మృతుడి బంధువుల వివరాలు తెలుసుకున్నామని తెలిపారు. మృతుడి తల్లి రుక్మిణి పరిడయా, అక్క రుస్మిత పరిడయా అతనిని గుర్తించారని వివరించారు. తల్లి తెలిపిన వివరాల ప్రకారం మృతుడి పేరు శంభునాథ్ పరిడయా(40) అని, అతడిది కందయాత సొడియా గ్రామమని తెలిపారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని.. ఎలా చనిపోయాడనే విషయమై దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రశాంతంగా పాలకవర్గ సమావేశం


మాట్లాడుతున్న మేయర్ వీవీ లక్ష్మి

విజయనగరం రింగురోడ్డు: నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం మేయర్ వీవీ లక్ష్మీ అధ్యక్షతన బుధవారం పాలకవర్గ సమావేశం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 28 అంశాలను అజెండాలో ఉంచగా... కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రస్తుతం ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లకు మరమ్మతులు చేయడం, కొత్తగా అర్బన్ హెల్త్ సెంటర్లు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల ఏర్పాటుపై చర్చించారు. 50 డివిజన్లలో ఉన్న పార్కులు, రోడ్లు పక్కన మొక్కలు నాటడం, వాటి నిర్వహణకు 15 మంది కూలీల కోసం అంచనాలు రూపొందించారు. విజయనగరం నగరపాలక సంస్థలో ఏడు సూపర్‌వైజర్, రెండు శానిటరీ సూపర్‌వైజర్ పోస్టులు భర్తీ చేయడానికి ప్రభుత్వానికి అనుమతి కోరుతూ తీర్మానించారు. వీటితో పాటు మరికొన్ని అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ వీవీ లక్ష్మీ మాట్లాడుతూ అందరి సహకారంతో నగరాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పైడిమాంబ పండుగ నేపథ్యంలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తావని, సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.నల్లనయ్య, కార్పొరేటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

బొబ్బిలి: రైళ్లలో గంజాయి, డ్రగ్స్, ఇతర నిషేధిత పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపుతామని రైల్వే పోలీసు సీఐ ఎ.రవికుమార్ అన్నారు. స్థానిక రైల్వే ఔట్‌పోస్టును ఆయన బుధవారం పరిశీలించి, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశా ప్రాంతాల నుంచి గంజాయి , ఇతర మత్తు పదార్థాల రవాణాను అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీగా నిఘా పెట్టామన్నారు. రైల్వే ప్లాట్‌ఫామ్‌లపై జేబుదొంగలు, అనుమానాస్పద వ్యక్తులు సంచరించకుండా కట్టడి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో హెచ్‌సి, ఔట్‌పోస్టు ఇన్‌చార్జి బండారు ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల అభీష్టం మేరకు పాలన

● ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం హామీలను వివరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



బెలగాం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల అభీష్టం మేరకు పాలన సాగిస్తున్నారని అధికారులు,ప్రజాప్రతినిధులు తెలిపారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి వందరోజులు పూర్తి చేసుకోవడంతో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలోభాగంగా బుధవారం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన హామీలను వివరించారు. ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించి కరపత్రాలను పంపిణీచేశారు.

● **బెలగాం:** పారదర్శక పాలన అందించడమే ఎన్డీఏ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. పార్వతీపురం మునిసిపాలిటీలోని 16, 17 వార్డుల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, మజ్జి వెంకటేష్, బి.సీతారాం పాల్గొన్నారు.

●**భామిని:** సంక్షోభంలోనూ సంక్షేమం అందించడం చంద్రబాబుకే సాధ్యమని పాలకొండ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి తెలిపారు. అత్తికొత్తూరులో ఇది మంచి ప్రభుత్వం కార్య క్రమం నిర్వహించారు.



భామిని: అత్తికొత్తూరు గిరిజనులకు ఇది మంచి ప్రభుత్వం గురించి వివరిస్తున్న భూదేవి

బుక్ చేసుకున్న రెండు రోజుల్లో ఇసుక

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: ఇసుక బుకింగ్‌ను వెంటనే డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఇసుక బుకింగ్ డెలివరీపై మైనింగ్ శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా ఇసుక బుకింగ్, డెలివరీపై సమీక్షించారు. ఇసుక పాలసీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుంచి ఇసుక బుకింగ్‌లను రెండు రోజుల్లో డెలివరీ పూర్తి చేయాలని మైనింగ్, రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. డెలివరీకి అవసరమైన వాహనాలను వెంటనే సమకూర్చుకోవాలని, తక్షణమే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.సమావేశంలో జేసీ శోభిక, మైనింగ్ రవాణాశాఖాధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

● పార్వతీపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మోహన్‌రావు



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

బెలగాం: రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో హామీలు నెరవేర్చాలని పార్వతీపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బత్తిన మోహన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద థాలి బచావో కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ వినిపించేలా పల్లెంపై గరిటెతో శబ్దం చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.చంటిబాబు, లక్ష్మయ్య, బి.శంకరరావు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్య

పాలకొండ: ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి మంజులవీణ తెలిపారు. బుధవారం పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ప్రిన్సిపాల్ వి.హరగోపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంజులవీణ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన ఫలితాలతో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పైల శంకరరావు, గోవిందరావు, వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పైల వెలమల అప్పారావు, వెంకటరమణ, చంద్రరావు, విజయరాజు పాల్గొన్నారు.

జనసేన వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామయం

పార్వతీపురంటౌన్: పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు పలు కార్యక్రమాలను నిర్వహించడం కోసం నియోజకవర్గ, పట్టణ, మండలాలకు సంబంధించి వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించినట్లు జనసేనపార్టీ పార్వతీపురం నియోజకవర్గ సమన్వయకర్త ఆదాడ మోహన్‌రావు తెలిపారు. బుధవారం పార్వతీపురంలోని పార్టీ కార్యాలయంలో పార్వతీపురం పట్టణానికి సంబంధించి పి.జయకృష్ణ, నియోజకవర్గానికి ఆర్.కరుణకుమార్, పార్వతీపురంమండలానికి ఎ. గాయత్రి, బలిజిపేటకు అప్పలనాయుడులకు నియామకపత్రాలను అందజేశారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

గరుగుబిల్లి :గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని నాగూరు ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ కోరారు. బుధవారం చిలకాంలో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రహదారులు, సీసీ కాలువలు తదితర మౌలిక వసతులు కల్పన చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.త్రినాథనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీవార్మింగ్ మాప్‌అప్ కార్యక్రమం పరిశీలన



ఎంఆర్‌నగరం పాఠశాలలో ఆల్‌బెండాజోల్ మాత్ర వేస్తున్న దృశ్యం

పార్వతీపురం రూరల్: ఎంఆర్‌నగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో డీవార్మింగ్ మాప్ అప్ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహన్‌రావు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి రఘుకుమార్ బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 3402 మందికి మాప్ అప్ సందర్భంగా ఆల్‌బెండాజోల్ మాత్రలువేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ్‌కుమార్, నరసింహమూర్తి, వైద్య సిబ్బంది నందిని, కన్నంనాయుడు పాల్గొన్నారు.

525 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ: వాహనంలో ఆంధ్రప్రదేశ్‌కు రవాణా చేస్తున్న 525 కిలోల గంజాయిని గుణుపురం పోలీసులు కర్లింగ సమీపంలో ఆర్ఎంసీ చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి వాహనంతో పాటు రెండు సెల్‌ఫోన్లు, రూ.150 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఒకరు గజపతి జిల్లా గులబ పోలీసుస్టేషన్ పరిధి సుండిపడకు చెందిన జితునాయక్(23)తో పాటు వాహనంలో ఓ మైనర్ సహాయకుడు ఉన్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన



నిరసన తెలుపుతున్న గెడశేశికల గ్రామస్థులు

రాయగడ: కొల్నార సమితి గెడశేశికల పంచాయతీ కార్యాలయానికి బుధవారం గ్రామస్థులు తాళంవేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రామంలో మంచినీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలు లేవని తెలిపారు.ఎన్నికల ముందు సమస్యలు తీరుస్తామన్న నాయకులు కనిపించడం లేదని ఆరోపించారు. ఎన్నికల తర్వాత సర్పంచ్ ఇంతవరకు గ్రామానికి రాలేదని తెలిపారు. గ్రామసమస్యలు తీరే వరకు కార్యాలయానికి వేసినతాళం తీసేప్రసక్తే లేదని చెప్పారు. అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరించాలని కార్యాలయం ఎదుట బైఠాయించారు.

రాయగడలో రక్తదాన శిబిరం

రాయగడ: రాయగడ అటానమస్ కళాశాలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. యూత్ రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో వైద్యులు గౌతమ్ పట్నాయక్, సహచరులు 32 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాకరేటర్ బాబిలతషారాఫ్, అధ్యాపకులు ఎ.శ్రీనివాస్, భగవాన్ బిశ్వాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఏబీబీ గుప్తా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మహిళలు ధర్నా

రాయగడ: రాయగడ సమితి పరిధిలోని 28 పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో ఐదు కేడర్లలతో పనిచేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఆయా పంచాయతీలకు చెందిన మహిళలు సమితి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో బ్యాంకుమిత్ర, కృషిమిత్ర, ప్రాణిమిత్ర, ఎంబీకే, సీఆర్పీ కేడర్ల కింద క్షేత్రస్థాయిలో వివిధ సేవలందిస్తున్న తాము పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. దీనిపై గతంలో ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడాకు వినతిపత్రం అందజేసినా పరిష్కారం కాలేదని వాపోయారు. తమకు న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.అనంతరం పలు డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రాన్ని సమితి అభివృద్ధి అధికారి అమూల్య కుమార్ సాహుకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు రంభ తాడంగి, కార్యదర్శి సుమిత్ర తరుక్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

● కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



మాట్లాడుతున్న తోయక జగదీశ్వరి

కురుపాం: ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. బుధవారం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి అభివృద్ధికమిటీ సమావేశం సూపరింటెండెంట్ శోభరాణి ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా జగదీశ్వరి ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది వివరాలు, ఖర్చు చేసిన నిధులు, మందులు నిల్వలు, రోగులకు అందజేస్తున్న భోజనం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సమస్యలు తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆసుపత్రిలో సక్రమంగా పనిచేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆకుల రమేష్, బోటు గౌరిశంకర రావు, మీసాల భారతి, ఈవోపీఆర్డీ ఆర్.రమేష్ బాబు, టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, మాజీ ఎంపీపీ రమణమూర్తి పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాల పరిశీలన

కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలలో అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం పరిశీలించారు.ఈసందర్భంగా హెచ్‌ఎం శంకరరావుకు వివరాలు అడిగితెలుసున్నారు. నిర్మాణం మధ్యలో నిలిచి పాఠశాల భవనానికి నిధులు మంజూరు చేయించాలని టీడీపీ నాయకులు, పాఠశాల కమిటీ చైర్మన్,సభ్యులు కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోలా చిరంజీవి, ఎస్.వెం కటరావు,ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు.

28న మన ఇళ్లు - మన గౌరవం కార్యక్రమం



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

జియ్యమ్మవలస : మండలంలో ప్రతీ పంచాయతీలో ఈనెల 28న జరగనున్న మన ఇళ్లు - మన గౌరవం కార్యక్రమం విజయవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ మండల అధికారి ఎల్.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సూపరింటెండెంట్ కె.రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనఇళ్లు - మన గౌరవం కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలో ఉన్న లేఅవుట్ వద్ద సమా వేశం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ఈ కార్యక్రమ ప్రాధాన్యత తెలియజేయాలన్నా రు. ఆర్‌ఎల్‌లో ఉన్న ఇళ్లు అక్టోబరు నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. బీఎల్, ఎల్ఎల్‌లో ఉన్న ఇళ్లు ఫిబ్రవరిలోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు, ఏపీఎం నాగభూషణరావు, కంప్యూటర్ ఆపరేటర్ హరినారాయణ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షకు సిద్ధంకావాలి: డీఈవో

సాలూరు రూరల్: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధంకావాలని డీఈవో జి.పగడాలమ్మ పిలుపునిచ్చారు. బుధవారం సాలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమయ్యే విధానాన్ని,మంచి మార్కులను సాధించడంలో మెలకువలను వివరించారు. విద్యార్థులు గణితం,భాషా అంశాలల్లో ప్రావీణ్యం సాధించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాల సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి పరీక్ష పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేవీ సత్యనారాయణ,సుధీర్‌రాజు పాల్గొన్నారు.

17 పాఠశాలల్లో చెకుముకి పరీక్ష

వీరఘట్టం:మండలంలోని 17 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జనవిజ్ఞాన వేదిక నిర్వహించి చెకుమకి సంబరాల ప్రతిభా పరీక్షకు ఎనిమిది, తొమ్మిది,పదో తరగతికి చెందిన 930 మంది విద్యార్థులు హాజరైనట్టు ఆ వేదిక మండల కన్వీనర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.ఎం.గౌరీశ్వరరావు, నూరు సతీష్ తెలిపారు. వీరిలో ఒక్కో తరగతి నుంచి ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గురు విద్యార్థులు అక్టోబరు ఒకటి నుంచి జరిగే మండల స్థాయి పరీక్షకు హాజరవుతారని చెప్పారు.

నిడగల్లు ఉన్నత పాఠశాలలో...

సీతానగరం : మండలంలోని నిడగల్లు ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ ప్రశ్న పత్రాలను ఉప విద్యాశాఖ అధికారి రాజ్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 8, 9,10 తరగతుల విద్యార్థులు రాశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు భారతి, చూడామణి, రేవళ్ల సతీష్‌రాజు పాల్గొన్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా పూజలు



పూజలు చేయిస్తున్న కూటమి నేతలు

సాలూరు రూరల్: సాలూరు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమల లడ్డు ప్రసాదం గత ప్రభుత్వం అపవిత్రం చేసిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా బుధవారం కూటమి నేతలు పూజలు చేశారు. తొలుత టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేశు,గుల్ల వేణు, గణపతి, రిషివర్ధన్, శివకృష్ణ, జగదీష్, విశ్వేశ్వరరావు, అప్పలనాయుడు ఆలయాన్ని శుద్ధిచేశారు. అనంతరం శ్రీవారికి రుత్వికుడు నారాయణాచార్యులతో విశేష పూజ చేయించారు. కార్యక్రమంలో కొనిసి చిన్ని, సత్యనారాయణ, హర్ష, దుర్గ, శ్రీకాంత్, కోటి, రాజు పాల్గొన్నారు.

పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయకు నివాళి

గరుగుబిల్లి: గరుగుబిల్లిలో జనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి పురస్కరించుకుని చిత్రపటానికి బీజేపీ మండలాధ్యక్షులు తుమ్మగుంట శంకరరావు (రాము), పెద్దిరెడ్డి అశోక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రౌతు వినోద్‌కుమార్, పి.అశోక్, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ ఇన్‌చార్జి ఏడీగా దీనకుమార్

గరుగుబిల్లి : గరుగుబిల్లి ఏరియా పశు వైద్య ఇన్‌చార్జి సహాయ సంచాలకులుగా సీతానగరం ఏరియా పశు వైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ సీహెచ్ దీనకుమార్‌ను నియమించారు. ఇంతవరకు గరుగుబిల్లి ఏరియా పశు వైద్య సహాయ సంచాలకులుగా పనిచేసిన బి.గణపతిరావు తూర్పు గోదావరి జిల్లా మండపేటలోని రాష్ట్ర పశు వైద్యుల శిక్షణ కేంద్రానికి ఉప సంచాలకులుగా పదోన్నతిపై బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులుగా డాక్టర్ దీనకుమార్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఢిల్లీలో సదస్సుకు సర్పంచ్

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశం కరరావు ఈనెల 29న ఢిల్లీలో జరగనున్న పీసా చట్టంపై అవగాహన చైతన్య సదస్సుకు ఎంపికయ్యారు.ఈ మేరకు బుధవారం బయలుదేరి వెళ్లారు.

చంద్రబాబుకు విరాళాలు అందజేత



సీఎంకు విరాళాలు అందజేస్తున్న సంధ్యారాణి

సాలూరు రూరల్: విజయవాడ వరద బాధితులకు పాచిపెంట మండలంలోని పాంచాళి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు సేకరించిన నిధులను బుధవారం సీఎం చంద్రబాబు నాయుడుకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అందజేశారు. బాధితులకు సాయం అందించడానికి విద్యార్థులకు చూపిన చొరవకు ఆయన అభినందించారు.

గోగు సాగుకు ప్రత్యేక ప్రణాళిక

గరుగుబిల్లి: గోగు పంట సాగుపై రైతులు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారని జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ రీజినల్ అధికారి ఆర్.అరుణ్, అడిషనల్ డిప్యూటీ మార్కెటింగ్ మేనేజర్ రామ్‌కిరణ్ తెలిపారు.మెట్ట ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో గోగు సాగుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. బుధవారం గరుగుబిల్లిలో గోగుసాగును పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం, గరుగుబిల్లి మండలాల పరిధిలో 350 ఎకరాలకుపైగా గోగు సాగు చేస్తున్నారన్నారు. సీతానగరం, బలిజిపేట మండలాల్లో సాగుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఆధునిక పద్ధతులతో విత్తనాలు వేయడం, గోగు పంటలో కలుపు నివారణ వంటి చర్యలు చేపట్టడంతో అధిక దిగుబడి సాధించే అవకాశముందని చెప్పారు. జిల్లాలోని రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

అన్ని గ్రామాల్లో రోడ్లు: ఎమ్మెల్యే

పార్వతీపురం రూరల్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ పక్కా రహదారుల నిర్మాణాలు ప్రారంభిస్తున్నట్టు ఎమ్మెల్యే బోనెల విజయచం ద్ర తెలిపారు. బుధవారం నర్సిపురం, కారాడవలసల్లో సీసీ రహదారి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దశలవారీగా అన్ని గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. 17 కోట్లు ఉపాధి నిధులతో శ్మశానాల అభివృద్ధి రహదారుల నిర్మాణంతో పాటు మురుగు కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు అందినట్టు తెలిపారు. వీధి దీపాల నిర్వహణతో పాటు గ్రామాల్లో పరిశుభ్రతను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల అభివృద్ధి పూర్తిస్థాయిలో జరుగుతుందన్నారు. కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్ష కార్యదరులు బోను దేవిచం ద్రమౌళి, చంటి, గొరజాన చంద్రమౌళి, సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట్‌నాయుడు, గౌరీ వెంకటరమణ, ఏగిరెడ్డి తవిటినాయుడు, సత్యనారాయణ, శ్రావణి పాల్గొన్నారు.

నిమజ్జనాలకు ప్రత్యేక పోలీసు బృందం



నిమజ్జనంపై యువతతో చర్చిస్తున్న ప్రత్యేక బృంద ఎస్ఐ రవీంద్రరాజు

సాలూరు రూరల్: సాలూరులో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం పర్యవేక్షణకు ఏర్పాటుచేసిన ప్రత్యేక పోలీసు బృందం బుధవారం పార్వతీపురం నుంచి పట్టణంచేరుకుంది. ఈ బృందంలో ఉన్న ఎస్ఐలు రవీంద్రరాజు, అమ్మన్నరావు, అప్పారావులు బుధవారం రాత్రి పెదయాతవీధి, కుమ్మరివీధుల యువతతో మాట్లాడారు. నిమజ్జనానికి పలు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ప్రశాంతం వాతావరణంలో వినాయక నిమజ్జనోత్సవం జరపాలని సూచించారు. పట్టణ ఏఎస్ఐ వలీ తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో గణనాథుని నిమజ్జనం

మామిడిపల్లి రాజులవీధిలో ఏర్పాటుచేసిన గణనాథుని బుధవారం నిమజ్జనంచేశారు. ఈసందర్భంగా వివిధ దేవతా వేషధారులతో అలరించారు. మామిడిపల్లి పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో నిమజ్జనానికి తరలివచ్చారు.

సాలూరులో స్వచ్ఛతాహీ సేవ ర్యాలీ

సాలూరు రూరల్: సాలూరులో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు బుధవారం స్వచ్ఛతాహీసేవ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతపై అవగాహనర్యాలీ చేశారు. ఈసందర్భంగా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలను నాలుగు రోజులుగా అంశాలు వారీగా నిర్వహిస్తున్నామ న్నారు. కార్యక్రమంలో ప్రసన్నకుమార్, వెంకటలక్ష్మి, సారథి పాల్గొన్నారు.

గ్రామ అభియాన్ ప్రణాళికలు సమర్పించాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: పీఎం జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ ప్రణాళికలు సమర్పించాలని కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి ఆర్.జయ ఆదేశించారు. బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులతో సమీక్షించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలపై పూర్తి వివరాలను అందజేయాలన్నారు. గిరిజనుల కోసం ఉత్తమ ఆసుపత్రిని ఎంపిక చేసి అందులో వైద్యసేవలు, పరికరాలపై తక్షణమే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాస్తవ, ఏపీవో ఏ.మురళీధర్, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు పాల్గొన్నారు.

స్కూల్ నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

సీతంపేట రూరల్: దారపాడు పంచాయతీ రామనగరం ప్రాథమిక పాఠశాల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సీపీఎం నాయకులు ఎం.తిరుపతిరావు డిమాండ్‌చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 1996లో రేకుల షెడ్‌తో నిర్మించిన పాఠశాల నేటి వరకు ఎటువంటి మరమ్మతులకు నోచుకోలేదన్నారు. నాడు-నేడు కింద కూడా గతంలో ఏ పనులూ చేపట్టలేదన్నారు. వర్షం వస్తే స్కూల్ అంతా కారిపోతుందని,చుట్టూ ఉన్న మట్టి కరిగిపోవ డం వల్ల గోడలకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఆరు గ్రామాలకు చెందిన 40 మంది ఆదివాసీ బాల బాలికలు ఇక్కడ చదువతున్నందున తక్షణమే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

బెలగాం: పార్వతీపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఐద్వా నాయకులు వి.ఇందిరా కోరారు. బుధవారం కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇందిరా మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం అవడంలేదని వాపోయారు. గుక్కెడు నీరు కోసం పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జంఝావతి, నాగావళి నదులు పక్కనే ఉన్నప్పటికీ తాగునీరు ప్రతి రోజు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం నెలకొందని తెలిపారు. తాగు నీరు సమస్య పరిష్కారం కోసం మూడు రోజులు రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. సమస్య పరి ష్కరించకపోతే అక్టోబర్ ఒకటో తేదీన చలో కలెక్టరేట్ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు రెడ్డి శ్రీదేవి, తులసి, గౌరి సీఐటీయూ నాయకులు వై.మన్మథరావు, సూరిబాబు పాల్గొన్నారు.



దీక్షలు చేస్తున్న ఐద్వా నాయకులు



